తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కన్నులపండువగా ప్రదోష నందిసేవ



-ప్రదోష నందిసేవకు హారతులిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, జూలై 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అత్యంత వైభవంగా ప్రదోష నందిసేవను కన్నులపండువగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తిని వెండి నంది వాహనంపై ఆశీనుల్ని చేసి ఆలయంలో ప్రదక్షిణ చేయించారు. స్వామివారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు.

## జులైలో వెంకన్న హుండీ ఆదాయం రూ.129 కోట్లు



తిరుమల, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తుల సంఖ్యను గమనిస్తే గణాంకాలు మాత్రం భక్తుల సంఖ్యతోబాటు వెంకన్న హుండీ ఆదాయం కూడా భారీగా రెట్టింపవుతోంది. భక్తులు తమ ఇష్టదైవానికి చెల్లించిన మొక్కుబడుల రూపంలో కానుకల ద్వారా జులైలో హుండీ ఆదాయం 129కోట్ల రూపాయలు చేకూరింది. తాజాగా సోమవారం హుండీ లెక్కింపు ఆదాయం 5.21కోట్లు రూపాయలు కాగా 17వతేదీ 5.40కోట్లు రూపాయలు, 4వతేదీ 4.90కోట్లు, 24వతేదీ 5 కోట్లు రూపాయలు, 10వతేదీ 5.11కోట్లు రూపాయలు రెట్టింపు ఆదాయం లభించింది. మిగిలిన రోజుల్లో దాదాపు 4కోట్ల రూపాయలుపైగానే ఆదాయం చేకూరింది.

## ఏడుకొండలస్వామికి రెండు బ్రహ్మోత్సవాలు

### భక్తుల రద్దీకనుగుణంగా సకల ఏర్పాట్లు -టిటిడి ఇఒ ధర్మారెడ్డి



తిరుమల, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:
కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. అధికమాసం రావడంతో సెప్టెంబర్ 18వ తేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు 23వతేదీతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా ధ్వజారోహణం జరిగే సెప్టెంబర్ 18వతేదీనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 15వతేదీ నుండి మొదలుకానున్నాయి. పెరటాసి మాసం కూడా సెప్టెంబర్‌లో ఆరంభమవుతుండటంతో భక్తుల రద్దీ అశేషంగా ఉంటుందని అందుకు తగ్గట్లు విస్తృతంగా సకల ఏర్పాట్లుచేయాలని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు బ్రహ్మోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం సాయంత్రం తిరుమల అన్నమయ్యభవన్‌లో టిటిడి ఇఒ సదాభార్గవి, వీరబ్రహ్మం, న్యాయాధికారి జస్టిస్ వీర్రాజు, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ 2 జగదీశ్వర్‌రెడ్డి, తిరుమల అదనపు ఎస్‌పి మునిరామయ్య, టిటిడి డిప్యూటీ ఇఒలు పి.హరీంద్రనాథ్, లోకనాధమ్, పిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితర విభాగాల అధికారులతో కలసి ఇఒ ఏవి ధర్మారెడ్డి సమీక్షించారు.

### నేటి తెల్లవారుజామున

## జాబిలి కక్ష్యకు చంద్రయాన్-3

### - అత్యంత క్లిష్టమైన ఆర్బిట్ రైజింగ్ ఆపరేషన్



శ్రీహరికోట (తడ), జూలై 31 ప్రభాతవార్త
భారత ప్రతిష్ఠాత్మక ప్రయోగం చంద్రయాన్-3 మరో కీలక ఘట్టానికి చేరుకునే సమయం దగ్గరైంది. ప్రస్తుతం భూమదిలీ కక్ష్యలో తిరుగుతున్న ఈ ఉపగ్రహం సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మంగళవారం తెల్లవారుజామున జాబిలి కక్ష్యలోకి ప్రవేశించనుంది. జూలై 14న శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఎల్‌విఎం3-ఎం4 రాకెట్ ద్వారా ప్రయోగించిన చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని భూకేంద్రాల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు నియంత్రిస్తున్నారు. బెంగళూరులోని ఇస్ట్రాక్ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 ప్రయాణాన్ని ఇప్పటికే ఐదుసార్లు నియంత్రించారు. ఉపగ్రహంలోని ఇంధనాన్ని మండిస్తూ దాని కక్ష్యను పెంచుకుంటూ పోతున్నారు. ఇదిలావుంటే, కీలకమైన ప్రస్తుత పరీక్షలో 28 నుంచి 31 నిమిషాల పాటు శాటిలైట్‌లోని ఇంధనాన్ని మండించనున్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి 12 గంటల పైన 1.30 గంటలలోపు ఈ ఘట్టం పూర్తి చేయనున్నారు. దీనిని టిఎల్ఐ మాన్యువర్ ఫైరింగ్‌గా చెప్తున్నారు.

**ఇది క్లిష్టమైన ఆపరేషన్**

ఇస్రో శాస్త్రవేత్తలకు చంద్రుని కక్ష్యలో చంద్రయాన్‌ను చేర్చడం అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌గా ఉంది. ప్రస్తుతానికి భూకక్ష్యలో ఉన్న చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని ఒక్కసారిగా చంద్రుని కక్ష్యకు మళ్లించడం అంత తేలికైన పనికాదు. సెకనుకు ఒక కిలోమీటరు దూరం తిరుగుతున్న ఉపగ్రహాన్ని మూడు కిలోమీటర్ల వేగం నుంచి ఏకంగా 10.9 కిలోమీటర్ల వేగం పెంచితే భూకక్ష్య నుంచి చంద్ర కక్ష్యకు ఉన్న 3 లక్షలా 83 వేల కిలోమీటర్ల దూరం చేరుకోవాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ జరిగేటప్పుడు సెకనుకు 10.9 కిలోమీటర్ల కన్నా కొంచెం ఎక్కువ వేగం అయినప్పటికీ అది అంతరిక్షంలోకి వెళ్లిపోతుందని తెలుస్తోంది. అప్పటికి చంద్రుని గురుత్వాకర్షణ తగ్గిపోయే ప్రమాదం ఉన్నందున ఇది అత్యంత క్లిష్టంగా మారనుంది. ప్రస్తుత కక్ష్య నుంచి అత్యంత అసాధారణ కక్ష్యకు చంద్రయాన్-3ని చేర్చే క్రమంలో శాస్త్రవేత్తలు అమిత జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం చంద్రయాన్-3 భూమికి దగ్గరదూరం పెరిజీలోకి వచ్చినప్పుడే దాన్ని వేగంగా చంద్రకక్ష్యలోకి మళ్లించాల్సి ఉంటుంది. శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో విజయవంతమైతే చంద్రయాన్-3 ప్రయోగంలో కీలక ఘట్టాన్ని అధిగమించిన వారవుతారు.

## స్పందన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

### జాయింట్ కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, జులై 31, ప్రభాతవార్త
స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాలవ్యవధిలోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్ధవంతంగా పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్‌డిసి శ్రీనివాసులు, భాస్కర్ నాయుడు, ఏఓ జయరాములతో కలిసి స్పందన గ్రీవెన్స్ అర్జీలను జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. స్పందన ఆన్‌లైన్ నమోదుతో రసీదులు అందించారు. మొత్తం 127 వినతులు రావడం జరిగిందని జిల్లా అధికారులు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాల్సిందిగా స్పందనకు హాజరైన అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

## కాలుష్యం కోరల్లో సూళ్లూరుపేట

### మున్సిపల్ డంపింగ్ యార్డుతో ప్రజలకు ముప్పు



సూళ్లూరుపేట, జూలై 31 ప్రభాతవార్త
ప్రభుత్వాలు మారుతున్నాయి. పాలకులు మారుతున్నారు. కానీ ప్రజలకు మాత్రం మౌలిక సదుపాయాలు కల్పనలో ఏ పాలకులూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఎన్నో ఏళ్లుగా పట్టణ ప్రజలకు తీరని సమస్యగా ఉన్న డంపింగ్ యార్డుకు మాత్రం మోక్షం లభించడం లేదు. చెన్నై నుంచి కోల్‌కతా జాతీయ రహదారిపై కాళంగినది సమీపంలో ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డు నుంచి నిత్యం వెలువడుతున్న కాలుష్యంతో కూడిన పొగ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను తగులబెట్టడంతో యార్డులో పెద్దఎత్తున మంటలు రెలరేగి దట్టమైన పొగ పట్టణాన్ని మొత్తం చుట్టేస్తోంది. ముఖ్యంగా కాళంగి నది సమీపంలో నుంచి పట్టణంలోకి దట్టమైన పొగ విస్తరించడంతో ప్రజలు శ్వాసకోస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ సమస్య ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయంగా పేరొందిన శ్రీహరికోటకు వెళ్లాలంటే ఈ మార్గం గుండానే ప్రముఖులు వెళుతుంటారు. ప్రముఖులకు దట్టమైన పొగతో కూడిన దుర్వాసన వెదజల్లుతున్న డంపింగ్ యార్డు దర్శనమిస్తుంది. గతంలో మన్నారుపోలూరు వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరిగినా అవి కార్యరూపం దాల్చడం లేదు. గత వారంరోజులుగా దట్టమైన పొగ పట్టణాన్ని చుట్టేస్తున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టి ప్రజలను డంపింగ్ యార్డు నుంచి వచ్చే దట్టమైన పొగ బారి నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు



పంటపొలాల్లో బోల్తాపడిన వాహనం, గాయపడిన బాధితులు

నాయుడుపేట, జూలై 31 ప్రభాతవార్త
నాయుడుపేటలోని కెఎంఆర్ ఫంక్షన్ హాలు సమీపంలో జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. జాతీయ రహదారి మీదుగా వెళుతున్న టాటా సుమో వాహనం అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. సత్యసాయి జిల్లా కదిరి తాలూకా పెద్దపల్లి గ్రామానికి చెందిన జిలాని సాహెబ్, మస్తాన్‌బి, సల్మా, అక్బర్‌బాషా, అమినాబిలతో పాటు మరో ఇద్దరు చిన్నారులు నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన ఏడుగురిని హైవే అంబులెన్స్, 108 వాహనాల్లో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అన్ని వర్గాల్లోను అభివృద్ధి - మంత్రి రోజా



నగరి, జూలై 31 ప్రభాతవార్త: సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని, ప్రతి గడపలోను సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని మంత్రి రోజా అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి 2వ వార్డు ఎంకెకె కండ్రిగ, కాకవేడు, ఎస్టీ కాలనీ, ఆది ఆంధ్రవాడ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. మండల స్థాయి అధికారులతో కలసి గడప గడపకు వెళ్లి వారికి గత నాలుగేళ్ళలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బుక్ లెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పాలనపై వైఎస్ఆర్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగుతుందన్నారు. ప్రతి ప్రాంతంలోను మంత్రికి స్థానికులు గజమాలతోను, శాలువలతోను సత్కరించి హారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పి.జి.నీలమేఘం, వైస్ చైర్మన్ వెంకటరత్నంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సీడీపీవో కృష్ణవేణి, మెప్మా టీఎల్ఎం సునీత, కౌన్సిలర్లు ఇంద్రయ్య, మురుగ, కో-ఆప్షన్ సభ్యులు హమీద్, నాయకులు మునివేలు, రాజముత్తు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిగ్గు పడడం కాదు చేతనైతే రాజీనామా చేయండి

### ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

తిరుపతి (క్రీడ), జులై 31, ప్రభాతవార్త



సిగ్గు పడడం కాదు చేతనైతే రాజీనామా చేయండని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని మద్యం మత్తు పదార్థాలను నియంత్రించాలని కోరుతూ ఈ నెల 28వ తేది నుంచి సత్యసాయి జిల్లాలో పోరు యాత్ర ప్రారంభమై సోమవారం తిరుపతికి చేరుకుంది. మహిళ విద్యాసంస్థలులో విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం జ్యోతి రావు పూలే విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి మహిళా సమాఖ్య ఎంఐఎంఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై హింస పెరిగిపోయిందని దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన రెజ్లర్లు తమను తమ అధ్యక్షుడు లైంగికవేధింపులకు గురిచేసాడని అతన్ని శిక్షించాలని నిరసన చేసిన తరువాత కేసు కట్టారని దేశంలో ఎప్పుడు లేని విధంగా 25 శాతం హింస పెరిగిందన్నారు. దీన్ని నియంత్రించడంలో వైఫల్యం చెందారన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగిస్తే దేశమంతా నిరసనలు పెరిగిన సందర్భంగా ఈ ఘటనకు సిగ్గు పడుతున్నాం అంటూ దేశ ప్రధాని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజంగానే సిగ్గు పడితే ప్రధాని పదవికి రాజీనామా చెయ్యాలన్నారు. హింసకు వ్యతిరేకంగా జరిగే నిరసనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని విజ్ఞప్తి చేసారు.

## మణిపూర్ ఘటన దేశం తలదించుకునేలా చేసింది

### - కుప్పంలో గిరిజన నేతలు..ఉద్యోగులచే కొవ్వొత్తులతో నిరసన !!



కుప్పం, జూలై 31 ప్రభాతవార్త
మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలపై జరిగిన ఘటన దేశం తలదించుకునేలా చేసిందని ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు రవినాయక్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి కుప్పంలో గిరిజన నేతలు, ఉద్యోగులు స్థానిక గాంధీ విగ్రహం నుంచి డా॥ అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈసందర భ్ంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు దేశానికి సిగ్గుచేటు అని పేర్కొన్నారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన చట్టాలు కాపాడడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈసంఘటనలకు కారకులైన వారిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన నేత కృష్ణప్ప, ఉద్యోగ సంఘ నేతలు ఎంఇఒ శ్రీదేవి, ఇంద్రాణి, రాజేశ్వరి, చంద్రనాయక్, శ్రీనివాసులు నాయక్, ఆనంద్‌నాయక్, నాగేశ్వరరావు, ప్రసాద్, రమేష్, భాస్కర్, బాలచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ దారుణ హత్య

*చిత్తూరు, జులై 31 ప్రభాతవార్త:*
*చిత్తూరు సాంబయ్యకండ్రిగలో ఆదివారం రాత్రి ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. కూలీ డబ్బుల పంపకంలో వివాదం నెలకొనడంతో ఆ మహిళతో గత కొంత కాలంగా సహజీవనం సాగిస్తున్న తమిళ్‌కుమార్ ఆమెను కత్తితో నరకి చంపివేశాడు. సాంబయ్యకండ్రిగలో సుకన్య(30), తమిళ్‌కుమార్‌లు గత కొంతకాలంగా సహజీవనం సాగిస్తుండేవారు. సుకన్య భర్త వదలి వెళ్ళిపోవడంతో ఇది వరకే పెళ్ళి అయిన తమిళ్‌కుమార్‌తో ఆమె కలిసి సహజీవనం సాగిస్తుండేది. ఇటుక బట్టీల్లో పనులు చేసుకొంటు వీరు కలిసి వుండేవారు. ఈ క్రమంలో గత కొంతకాలం క్రితం తమిళనాడుకు వెళ్ళిన తమిళ్‌కుమార్ వారం క్రితం ఇక్కడికి వచ్చి ఇటుక బట్టీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇసుక బట్టీ పనుల కూలీ విషయంలో సుకన్య, తమిళ్‌కుమార్‌కు మధ్య వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఇద్దరికి మాట మాట పెరగడంతో ఆదివారం రాత్రి తమిళ్‌కుమార్ సుకన్యను కత్తితో మొఖం, మెడపై పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. సుకన్యకు తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ హత్య చేసిన తమిళ్‌కుమార్ సంఘటనా స్థలం నుండి పారిపోయాడు. ఈ మేరకు సుకన్య మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు వన్‌టౌన్ ఎస్ఐ ప్రసాద్ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇన్స్‌పెక్టర్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.*

## మృతుడి కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలి..!

### దీక్షకు ఆటంకం కలిగిస్తే "ఆత్మార్పణ" : టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని



చంద్రగిరి, జూలై 31 ప్రభాతవార్త:
ఇసుక రీచ్‌లో నీటమునిగి అశువులుబాసిన మృతుడి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయలు పరిహారం ప్రకటించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని డిమాండ్ చేశారు. అక్రమ ఇసుక రీచ్‌ల కారణంగా మరణించిన కార్తీక్ కుటుంబానికి న్యాయం చేయాలనీ, ఇసుక అక్రమ రవాణాకు సహకరించిన అధికారులను సస్పెండ్ చేయాలనే డిమాండ్‌తో సోమవారం ఆయన టవర్ క్లాక్ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. పులివర్తి నాని ఆమరణ దీక్ష చేపట్టనున్న నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు ముందస్తుగా బలగాలను మోహరించారు. ఆమరణ దీక్షను అడ్డుకునేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రశాంత వాతారణంలో చేపట్టిన తన దీక్షను భగ్నం చేయాలని భావిస్తే ఆత్మార్పణకు సైతం సిద్దమని నాని తన వద్ద గల పెట్రోల్ క్యాన్‌ను చూపించారు. ఇసుక రీచ్‌లో అక్రమార్కుల కారణంగా ఒక విద్యార్థి మరణిస్తే అతని తల్లిదండ్రులతో శవ రాజకీయాలంటూ ఎదురుదాడి చేయిస్తారా అంటూ నిలదీశారు. సి.రామాపురంలో డంపింగ్ యార్డు తరలించేందుకు ఎంఎల్‌ఏ చేసిన విధంగా తాను చెత్త రాజకీయం చేయబోనన్నారు. రాయలచెరువు కట్ట మరమత్తుల సమయంలో రాజకీయ నటనలకు పాల్పడింది ఎవరో అందరికీ తెలుసంటూ ఎద్దేవా చేశారు. ఇసుక అక్రమాలపై టిడిపి పోరాటం చేస్తే 24 మందిపై అక్రమంగా బనాయించిన కేసులను కొట్టివేయాలని డిమాండ్ చేశారు. స్వర్ణముఖీ నదిలోనుండి ఇసుక రోడ్డుపైకి తీసుకురావడంలో సహకరించిన ప్రతి పోలీసు అధికారినీ సస్పెండ్ చేసే వరకు తన దీక్ష విరమించబోనని తేల్చిచెప్పారు.

### ఆర్‌డిఓ, డిఎస్పీ హామీతో దీక్ష విరమణ

తమ డిమాండ్‌ల పరిష్కారానికి ఆర్‌డిఓ కనకనరసారెడ్డి, డిఎస్పీ టి.డి.డాక్టర్ యశ్వంత్, తహశీల్దార్ శిరీషా హామీ మేరకు టిడిపి నాయకత్వం సూచనలతో ఆమరణ నిరాహార దీక్షను విరమించు కుంటున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్ పులివర్తి నాని ప్రకటించారు. సోమవారం ఉదయం నుండి ఇసుక రీచ్‌లు మూసివేత, అక్రమార్కులపై కేసుల నమోదు, గంజాయి నియంత్రణ వంటి అంశాలపై ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్న పులివర్తి నాని దీక్షా శిబిరం వద్దకు రాత్రి 9 గంటల సమయంలో అధికారులు చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారకులైన వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అతిధుల హర్షాతిరేకాల నడుమ మాజీ మంత్రి పరసారత్నం, మాజీ ఎంఎల్‌సి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంఎల్‌ఏ సుగుణమ్మ నిమ్మరసం అందజేసి పులివర్తి నాని దీక్షను విరమింపజేశారు. అనంతరం నాని మాట్లాడుతూ మన డిమాండ్‌లు పరిష్కరించడానికి అధికారులు ముందుకు రావడం మనందరి విజయమన్నారు. ఆమరణ దీక్షకు మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. మీ అందరి కృషితో దీక్ష సక్సెస్ అయినట్లు క్యాడర్‌కు తెలిపారు.



## మత్తు పదార్థాలకు బానిసలు కాకండి

### -జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఛైర్మన్



బంగారుపాళ్యం, జూలై 31 ప్రభాతవార్త: విద్యార్థులు విద్యార్థి దశలోనే మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని జిల్లా న్యాయసేవాసమితి అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కరుణకుమార్ సూచించారు. సోమవారం స్థానిక విజ్ఞాన్ డిగ్రీ కళాశాల నందు అంతర్జాతీయ డ్రగ్స్ దినోత్సవాన్ని చిత్తూరు రూరల్ ఎక్సైజ్ శాఖ నిర్వహించింది. ఈసమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులు గుర్తించాలన్నారు. అలాగే మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వుంటుందని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్, హెరాయిన్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్, కళాశాల కరస్పాండెంట్ వెంకటాచలం ఇతర సిబ్బంది పాల్గొన్నారు. .

## గణనాధుని సేవలో జడ్పీ వైస్ ఛైర్మన్



కాణిపాకం, జూలై 31 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బి.ధనంజయరెడ్డి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 9న అరగొండలో ఆడికృత్తిక ఉత్సవాలు

తవణంపల్లె, జూలై 31 ప్రభాతవార్త: మండలంలోని అరగొండలో వెలసిన శ్రీస్వయంభువనేశ్వర కుమారస్వామి దేవస్థానంలో ఈనెల 8,9 తేదీల్లో ఆడికృత్తిక ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అరగొండ, పైమాఘం గ్రామస్థులు తెలిపారు. ప్రతి ఏటా ఆలయంలో రెండు రోజుల పాటు ఆడికృత్తిక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ ధర్మకర్త పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 8న భరణి వేడుకలు, 9న ఆడికృత్తిక, కావడి చెల్లింపులు, రాత్రి పుష్పపల్లకి సేవ ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ప్రముఖ కళాకారులచే హరికథలు, బుర్రకథలు, భక్తి సంకీర్తనలు, చెక్కభజనలు, కోలాటాలు, నయ్యాండి మేళం, కరగాట్టం వివిధ వేషధారణలు వంటి పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## ఉచితంగా విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

తవణంపల్లె, జూలై 31 ప్రభాతవార్త: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అరగొండ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు దాతలు సోమవారం ఉచితంగా విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. ఈమేరకు అరగొండ బీసీ కాలనీకి చెందిన ప్రవాస భారతీయులు సరిత, వంశీనాథ్ దంపతులు తమ కుమారుడు అన్విత్ పుట్టినరోజు సందర్భంగా అరగొండ బీసీ కాలనీ ఎంపీపీ స్కూల్, అరగొండ బాలురోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. దాతలు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్‌లు,పెన్సిల్‌లు, భోజన ప్లేట్స్ తదితర సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సరళకుమారి,టీడీపీ బీసీ సెల్ నాయకుడు గిరిబాబు, సరిత, వంశీనాథ్ కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రోను సందర్శించిన మదర్‌థెరిసా విద్యార్థులు



పెద్దపంజాణి జూలై31 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)ను మండలంలోని లింగాపురం సమీపంలోని మదర్‌థెరిసా సిబిఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆదివారం ఇస్రో ప్రయోగించిన పిఎస్ఎల్‌విసి-56 రాకెట్ ప్రయోగాన్ని 120మంది విద్యార్థులు ప్రత్యక్షంగా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వీక్షించారు. ఈ సందర్భంగా ఇస్రో ప్రాంగణంలో మదర్‌థెరిసా పాఠశాలకు చెందదిన విద్యార్థులు తేజల్,తనూజ,లిఖీషాలు రాకెట్ ప్రయోగంపై ప్రసంగించి అలరించారు. ఇస్రో పర్యాటక కేంద్రంలో ప్రదర్శనకు ఉంచిన రాకెట్,ఉపగ్రహ నమూనాలను వీక్షించి విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. అనంతరం పులికాట్ సరస్సు,తిరుపతిలోని రీజనల్ సైన్స్ సెంటర్‌నుకూడా విద్యార్థులు సందర్శించారు. ఇటువంటి అవకాశాన్ని కల్పించిన మదర్‌థెరిసా విద్యా సంస్థల అధినేత,పాఠశాల కరస్పాండెంట్ యం.రవీంద్రబాబుకు విద్యార్థులు,ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## కుప్పంలో మెప్మా సంఘాలచే జగనన్న మహిళా మార్కెట్

### - మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



కుప్ప ం, జూలై 31 ప్రభాతవార్త: కుప్పం మున్సిపాలిటీ పరిధిలో మెప్మా సంఘాలచే త్వరలోనే జగనన్న మహిళా మార్కెట్‌ను ప్రారంభిస్తామని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. సోమవారం మెప్మా ఆధ్వర్యంలో పట్టణ మహిళా సమాఖ్యను ఏర్పాటుచేశారు. మున్సిపల్ పరిధిలోని 1015 గ్రూపులకు గాను 26 సమాఖ్యలు ఏర్పాటుచేసి అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కోశాధికారి, సభ్యులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. సిఎం జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర పథకాల వల్ల లబ్ది పొందే మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా కృషి చేయాలని కోరారు. మహిళల పొదుపుతోనే కుటుంబాలు బాగుపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ రంగయ్య, మెప్మా సిఇఒ జగదీష్, పట్టణ సమైక్య అధికారి శ్రీరాములు, ఆర్‌పిలు పాల్గొన్నారు. కాగా లక్ష్మిదేవి, రాధ అనే ఆర్‌పిలకు ఆర్నెల్లుగా వేతనాలు రాకపోవడంతో వారికి 46వేలను ఛైర్మన్ డా॥ సుధీర్ అందించారు.

## బిసిఎన్ గ్రూప్స్‌చే చిరువ్యాపారులకు తోపుడుబళ్లు పంపిణీ




కుప్పంరూరల్, జూలై 31 ప్రభాతవార్త: కుప్పం బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్‌రాజ్‌ల నేతృత్వంలో కుప్పం లయన్స్ క్లబ్ అధ్వర్యంలో చిరు వ్యాపారులకు తోపుడు బళ్లు, గొడుగులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా బిసి నాగరాజ్ మాట్లాడుతూ చిరు వ్యాపారులను తమవంతు ఆదుకునేందుకు వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ సుమారు 70వేలతో తోపుడు బళ్లను పేదలకు అందించడం తమకెంతో గర్వకారణమన్నారు. ఈసందర్భంగా చిరువ్యాపారులకు తోపుడుబళ్లు, గొడుగులను అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ అధ్యక్షుడు డా॥ మహేష్, కుప్పం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యే ంద్రశేఖర్, కోశాధికారి పిజి సెల్వం, సభ్యులు సోమశేఖర్, సెంధిల్, శివ, లెనిన్, సతీష్, సుబ్రమణ్యం, మణి, ప్రకాష్, చరణ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, కోఆర్డినేటర్ మాధవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మృతుల కుటుంబాలకు చంద్రబాబు తరపున ఆర్థికసాయం



శాంతిపురం, జూలై 31 ప్రభాతవార్త: మండలంలోని బండపల్లి మాజీ సర్పంచ్ నాగరాజు గుండెపోటుతో మృతి చెందారు. ఈయన మృతి పట్ల తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియల కోసం చంద్రబాబు తరపున నేతలు విశ్వనాథనాయుడు, జనార్థనరెడ్డి, నాగరాజు, చంద్ర, మణి, నామాలప్ప తదితరులు పదివేల ఆర్థికసాయం అందించారు. అలాగే మొరసనపల్లి మాజీ ఎంపిటిసి గోవిందప్ప సోదరుడు నారాయణప్ప మృతి చెందగా ఆయన కుటుంబానికి సైతం పదివేలు చంద్రబాబు తరపున అందించారు. కార్యక్రమాల్లో రమేష్, నాగరాజు, ప్రకాష్, భాస్కర్, మునెప్ప, బసవరాజు, నారాయణస్వామి పాల్గొన్నారు.

## వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలి



శాంతిపురం, జూలై 31 ప్రభాతవార్త: వాల్మీకి కులస్తులను ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చాలని తెదేపా వాల్మీకి సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం శాంతిపురం మండల వాల్మీకి సంఘ అధ్యక్షుడిగా నంజంపేట సూరి, కార్యదర్శిగా నిమ్మనపల్లి రవికుమార్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీల్లో చేర్చుతామని సిఎం జగన్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర సాధికార కమిటీ సభ్యుడు సింగిరి శ్రీనివాసులు, జిల్లా కమిటీ అధ్యక్షుడు బేటప్ప నాయుడు, గుడుపల్లె టిడిపి అధ్యక్షుడు బాబునాయుడు, గోవిందు, రామచంద్ర, ప్రభాకర్, రమణ, యువరాజ్, మునిరాజు, రామూర్తి, బాలకృష్ణ, ఆనంద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ చాఫ్ కట్టర్లను సద్వినియోగం చేసుకోండి : ఎంపీడివో



వెదురుకుప్పం, జూలై 31 ప్రభాతవార్త : రాయితీ చాఫ్ కట్టర్లను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడివో సుధాకర్‌రావు సోమవారం అన్నారు. మండల కేంద్రంలోని భారతం మిట్ట వద్ద గల పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో రాయితీ చాఫ్ కట్టర్లు పాడి రైతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులను ప్రోత్సహించడం కొరకు సబ్సిడి పై చాఫ్ కట్టర్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాక సహాయ సంచాలకురాలు రూపసుందరి, వైఎస్సార్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి,జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజీ, మాజీ పుత్తూరు మార్కెట్టింగ్ కమిటీ ఉపాధ్యక్షులు మరకాలకుప్పం రామయ్య, నాయకులు చొక్క గోవింద్, నరేష్ రెడ్డి, పశువైద్యులు డాక్టర్ రాజేష్, డాక్టర్ నాగేంద్ర, పశు వైద్య సిబ్బంది మధు, గణేష్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అధికారుల నిర్లక్ష్యంతో పంట కాలువ పూడ్చివేత

### టిడిపి నాయకులు



కోట, జులై 31, ప్రభాతవార్త: తిరుపతి జిల్లా కోట మేజర్ పంచాయితీలోని పంట కాలువను ఇటీవల పూడ్చడంతో మురుగు నీరు వీధులు, ఇళ్ళల్లోకి ప్రవహిస్తోందని, సత్వరమే పూడికతీత చర్యలు చేపట్టాలని పలువురు తెలుగు దేశంపార్టీ నాయకులు, ఆకుతోట దిబ్బ ప్రాంత వాసులు సోమవారం తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవానిలకు ఫిర్యాదు చేసారు. పంచాయితీ, ఇరిగేషన్ అధికారులు పంట కాలువను పూడ్పించారని, ప్రస్తుతం ఈ పరిస్థితికి వారే కారణమని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వారు మాట్లా డుతూ పంచాయితీ ఈవో, ఇరిగేషన్ ఏఈలు ముందుచూపు లేకుండా పంట కాలువ పూడ్చివేయడం జరిగిందన్నారు. మురుగునీరు వెళ్లే మార్గం లేక ఈ పరిస్థితి దాపురించిందని, ఇలాగే ఉంటే వర్షాకాలంలో తమ పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు. అధికారుల అలక్ష్యంతో ఆకుతోట దిబ్బ ప్రాంతానికి చెందిన ప్రజలు, విద్యార్థులు, పాదాచారులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. పంచాయితీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ పంచాయితీ అధికారి, సిబ్బంది సమస్యను పరిష్కరించకపోవడం దారుణమని విమర్శించారు. మురుగునీరు వీధుల్లో, ఇళ్లల్లోకి ప్రవహించడం వల్ల రాత్రైతే దోమల బెడద తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, తెలుగు దేశం పార్టీ బీసీ సెల్ కార్యదర్శి తీగల సురేష్ బాబు, కోట ఎంపిటిసిలు షేక్ షంషుద్దీన్, దారా సురేష్, ఆకుతోట దిబ్బ ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడండి



కోట, జులై 31 ప్రభాతవార్త: కోటలోని రెడ్డి కల్యాణ మండపం వెనుక జగనన్న ఇంటి స్థలాలను మంజూరు చేశారని టిడిపి అధికార ప్రతినిధి దాసరి చైతన్య చెప్పారు. ఆయన సోమవారం మాట్లాడుతూ జగనన్న ప్లాట్లు మంజూరు చేసిన అనేక ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం జరుగుతున్నా కోటలో మాత్రం రెడ్డి కల్యాణ మండపం వెనుక ప్రాంతంలో విద్యుత్, రోడ్డు, నీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆదివారం కొందరు వ్యక్తులు జెసిబితో ఆ ప్రాంతంలో శుభ్రం చేశారని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు జెసిబితో పాటు అక్కడ నుంచి పరారయ్యారని తెలిపారు. దీంతో ఆ వ్యక్తులు ఎవరో విచారించి పోలీసులు కేసునమోదు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ భూములు దురాక్రమణ కాకుండా అధికారులు కాపాడాలని చైతన్య కోరారు. ఆ భూములను ప్లాట్లు వేసి జగనన్న ఇంటి పథకం కింద గ్రామసభలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రభుత్వం పేదలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## ఓటర్ల జాబితాలను తప్పులు లేకుండా చేయండి



బాలాయపల్లి, జులై 31, ప్రభాతవార్త: ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సవరణ చేయాలని తహసీల్దారు శ్రీనివాసులు బీఎల్వోలను ఆదేశించారు. సోమవారం తహసీల్దారు కా ర్యాల యంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వ హించారు. మండలంలో 39 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒకే ఇంట్లో 63 ఓట్లు ఉన్నాయని, దీనిని సర్వే చేయాలని సూచించారు. ఇంటి నెంబరు లేకుండా 1300 ఓట్లు ఉన్నాయని, 1250 వాటిని సరి చేశారని, మిగతా వాటిని కూడా సరి చేయాలని తెలిపారు. కాగా పిరమిడ్ గ్రామంలో ఉన్న వాల్మీకి పల్లి రెడ్డి కులాలకు బీసీ ఏ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని మాజీ సర్పంచ్ మురళీ గ్రామస్థులు తహసీల్దారుకు తెలిపారు.

## కడివేడులో మహాశక్తి కార్యక్రమం విజయవంతం



చిల్లకూరు, జులై 31, ప్రభాతవార్త: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు, ఆత్మహత్యలు అరికట్టేందుకు నూతనంగా ప్రవేశ పెట్టిన మహాశక్తి కార్యక్రమం ప్రవేశ పెట్టడం జరిగింది. గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూచనలు మేరకు గూడూరు డివిజన్‌లో రెండు బృందాలుగా ఏర్పాటు చేయడం జరిగింది. మొదటి బృందంగా రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి ఆధ్వర్యంలో సోమవారం కడివేడు అరుంధతి వాడలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు మహిళలు పెద్దఎత్తున పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తిరుపతి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉషా పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ఎక్కడ చూసిన మానభంగాలు, హత్యాచారాలు ఎక్కువగా ఉందన్నారు. మహిళలు రోడ్డు మీదుకు రావాలంటేనే భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. అదే విధంగా నిత్యవసర ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయని వారు తెలిపారు. 2024లో చంద్రబాబు నాయుడను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రాగానే దీపం పథకం కింద ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, తల్లికి వందనం ద్వారా ఏడాదికి ఎంత మంది విద్యార్థులు ఆ కుటుంబంలో వుంటే ప్రతి ఒక్కరికి 15 వేల రూపాయిలు ఇవ్వడం జరుగుతుందని, ఇంకా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు. అందువల్ల మహిళలు అందరూ పెద్ద ఎత్తున రాష్ట్రంలో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా, గూడూరు ఎమ్మెల్యేగా పాశం సునీల్ కుమార్ ను గెలిపించుకోవాలని వారు తెలిపారు. అనంతరం మహాశక్తి కరపత్రాలను ఇంటింటికి వెళ్లి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి, యదనపర్తి భాస్కర్ రెడ్డి, దొడ్ల నాగరాజు, గుండాల భారతి, చిరంజీవమ్మ, సుధా, వెంకటేశ్వర్లమ్మ, పి. శ్రీదేవి, ఎస్‌కె ప్రవీణ, పి. లక్ష్మి, సుప్రజ, చిరంజీవి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## వీధులు బురదమయం..దోమల స్వైర విహారం

### - పట్టించుకోని అధికారులు



దొరవారిసత్రం, జూలై 31 ప్రభాతవార్త: దొరవారిసత్రం మండలం తనయాలి గ్రామంలోని రోడ్డు గుంటలు ఏర్పడి బురదమయంగా దర్శనమిస్తున్నాయి. అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మావిళ్లపాడు నుంచి శ్రీకాళహస్తి వరకు ఉన్న ఈ రహదారి తనయాలి వద్ద గుంటలు ఏర్పడి బురదమయంగా మారింది. దీనికితోడు వర్షంతో ఆ గుంటల్లో నీరు నిండిపోయి ఎటూ వెళ్లడానికి వీల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఆ గుంటల్లో పడి ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ గుంటల్లో ఉన్న బురదతో రాత్రి సమయంలో దోమలు చేరి స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

### - జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద



వెంకటగిరి, జులై 31, ప్రభాతవార్త: గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. వెంకటగిరి పట్టణానికి చెందిన 83-84 సంవత్సరం 10వ తరగతి పూర్వపు విద్యార్థులు స్వామి వివేకానంద రచనల పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాల యంలో రాక్స్ కూడా లేవని చెప్పడంతో వాటిని కూడా ఇస్తామని దాతలు చెప్పారన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని సూచించారు. గ్రంథాలయాలు విజ్ఞాన గనులని తెలిపారు. విద్యార్థులు పెద్దలు గ్రంథాలయాలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అలిశెట్టి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామాపురంలో పౌరహక్కుల దినం



తడ, జులై 31 ప్రభాతవార్త: తడ మండలం రామాపురం ఎస్సీ కాలనీలో సోమవారం సాయంత్రం పౌర హక్కుల దినం నిర్వహించారు. ఎస్సీ కాలనీ వారికి శ్మశాన వాటిక లేదని, దాని వల్ల ఇబ్బందిగా ఉందని అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కటారి జయజయరావు మాట్లాడుతూ పైఅధికారులకు నివేదిక పంపుతానని చెప్పారు. సూళ్లూరుపేట హాస్టల్ వెల్ఫేర్ అధికారి, పోలీసు, ఆరోగ్య, రెవెన్యూ అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచ్ టికె శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

## కారూరులో ఎమ్మెల్యే సంజీవయ్యకు ఘన స్వాగతం



తడ, జూలై 31 ప్రభాతవార్త: తడ మండలం కారూరులో సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థా నం పాలక మండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్యకు అడుగడుగునా ఘనస్వాగతం లభించింది. ఈ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే విచ్చేశారు. కారూరు సచివాలయం పరిధిలోని వివిధ పల్లెల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు పలువురు గ్రామ ప్రజలు పూలమాలలు వేసి దిష్టి తీసి ముగ్గులతో స్వాగతం పలికారు. మండల అధ్యక్షుడు కొళవి రఘురెడ్డి, జెసిఎస్ కన్వీనర్ ఆర్‌కె సుందరరెడ్డిలతో పాటు మండలంలోని పార్టీ నాయకులు కె.ఆర్ముగం, పూడి మురుగన్, కె.శేఖర్‌బాబు, కారూరు మురుగన్, రత్నం, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరు గురించి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. సంక్షేమ కార్యక్రమాల బుక్‌లెట్లను ఇంటింటా పంచిపెట్టారు.

## బిసి సామాజిక వర్గానికి భూములివ్వండి

కోట, జూలై 31 ప్రభాతవార్త: కోట మండలం కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని గోవిందపల్లి గ్రామంలో బిసి సామాజిక వర్గం వారికి 70 మందికి ప్రభుత్వం 2005లో అసైన్‌మెంట్ భూములను మంజూరు చేసిందని ఆ గ్రామస్థులు చెప్పారు. ఆ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ పద్మావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 863, 864, 865, 866, 867, 868, 869, 870 నంబర్లలో సదరు భూములను ఎస్ఇజడ్‌కు పోయాయని, తమకు నష్టపరిహారం కూడా మంజూరు చేసినట్లు చెప్పారు. అయితే కృష్ణపట్నం పోర్టు వారు రెవెన్యూ రికార్డులలో కూడా నమోదు కూడా చేశారని తెలిపారు. కృష్ణ పట్నం పోర్టు యాజమాన్యం సమీకృత భూముల్లో పనులు మొదలుపెట్టలేదన్నారు. ఆ భూముల్లో తాము సాగు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే గోవిందపల్లి గ్రామ దళితులు తమ పొలాల్లో సాగు చేయనివ్వకుండా అడ్డుపడుతున్నారని తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ విచారించి న్యాయం చేస్తామన్నారు.

## నాయుడుపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నాయుడుపేట, జూలై 31 ప్రభాతవార్త: నాయుడుపేట మున్సిపల్ కార్యాలయం లో సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 అంశాలతో అజెండాను కమిషనర్ శ్రీనివాసరావు కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపికతో మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## దామానెల్లూరు హైస్కూలు విద్యార్థులకు ప్లేట్లు అందజేత

సూళ్లూరుపేట, జూలై 31 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మండల పరిధిలోని దామానెల్లూరు హైస్కూల్ విద్యార్థులకు సోమవారం పూర్వపు విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే ప్లేట్లను అందజేశారు. 2004-09 సంవత్సరం వరకు హైస్కూలులో చదివిన విద్యార్థులు కలిసి వితరణగా ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కవిత చేతులు మీదుగా ప్లేట్లు అందజేశారు.

# తిరుపతి డివిజన్

## పకడ్బందీగా నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ

తిరుపతి కలెక్టరేట్, జులై 31 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగష్టు 10వ తేది నుంచి 17వ తేదిలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఉన్నత విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు గురుకుల పాఠశాలలు, బడి బయటి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు 2 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల పిల్లలకు అందరికీ 400 ఎంజీ, 1 నుంచి 2 సంవత్సరాల లోపు పిల్లలకు 200 ఎంజి మాత్రలు ఉచితంగా పంపిణీ



నులిపురుగుల దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి డికె బాలాజీ

చేయడం జరుగుతుందని పిల్లలకు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, డిఆర్‌డిఏ జిల్లా ప్రజా పరిషత్, మున్సిపల్ కమీషనర్లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ, వసతి గృహాల అధికారులు, సంబంధిత వైద్యాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వంద శాతం అమలు చేసేలా చూడాలని తెలిపారు. పిల్లలకు ఈ మాత్రలు మధ్యాహ్నం ఆహారం తీసుకున్న తర్వాత, ఒక సంవత్సరం నిండిన వయసు గల పిల్లకు సగం మాత్ర 200ఎంజి ఇవ్వాలని, 2 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర 400 ఎంజి చొప్పున మాత్రలు చప్పరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య అధికారులు, మండల పరిధిలో మండల విద్యా శాఖాధికారులు, అంగన్‌వాడి ప్రాజెక్టు అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీహరి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శాంతాకుమారి, డిపిఓ రాజశేఖర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ హరినాథ్ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### నేడు ఊంజల్‌సేవ

శ్రీకాళహస్తి,జులై 31 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో పౌర్ణమి సందర్భంగా నిర్వహించే స్వామిఅమ్మవార్ల ఊంజల్‌సేవను మంగళవారం రాత్రి నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఇఒ కెవి సాగర్‌బాబు వివరించారు. పున్నమి వెన్నెలలో స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో ముస్తాబు చేసి సోమాస్కందమూర్తిని కోట మండపంలోనూ, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని పొన్నచెట్టు సమీపంలోని నాలుగుకాళ్ళ మండపంలో ఏర్పాటు చేసిన ఊయల్లో ప్రతిష్టించి సేవ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సేవలో భక్తులు విరివిగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

### రోగులకు సేవాదృక్పథంతో వైద్యం అందించండి



తొట్టంబేడు, జులై 31 ప్రభాతవార్త : రోగులకు సేవా దృక్పథంతో వైద్యసేవలు అందించాలని న్యాయ వాదులు తెలిపారు. శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి ఆదేశాల మేరకు పట్టణంలోని గజేంద్రనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా న్యాయవాదులు గరికపాటిరమేష్‌బాబు, రాజేశ్వర రావు, అరుణ్‌లు మాట్లాడుతూ వైద్యశాల చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న సిబ్బందికి పరిసర పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్యశాలకు వచ్చిన రోగులకు సేవా దృక్పదంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పిస్తూ ఏమైనా సమస్య ఉంటే న్యాయమూర్తి వినతిపత్రం అందిస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. మరిన్ని న్యాయసలహాలకోసం 15100 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### ప్రత్యేక ప్రతిభావంతుల జిల్లా స్థాయి పోటీలు

శ్రీకాళహస్తి,జులై 31 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలోని ప్రత్యేక ప్రతిభావంతులను ప్రోత్సహించుటకు శ్రీకాళహస్తిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఏర్పాటు చేసారు. సోమవారం ఈ పోటీలు ప్రారంభించటానికి ముఖ్యఅతిధిగా వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులంటే దేవుని పిల్లలని వారు అన్ని రంగాల్లోరాణించే ప్రతిభ ఉన్న వారు అంటూ కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాల్లో వారికి చేయూత నివ్వటమే కాకుండా మానసిక ఉత్సాహాన్ని కల్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఇఓలు భువనేశ్వరి, బాలయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, తల్లిదండ్రుల కమిటి అధ్యక్షుడు శంకర్, ఐఈఆర్‌టి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### ముళ్ళపూడి కాలనీలో బంగారమ్మ తిరునాళ్ళు

శ్రీకాళహస్తిరూరల్,జులై 31 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలంలోని ముళ్ళపూడి గిరిజన కాలనీలో వెలసిన బంగారమ్మ ఆలయంలో జాతర సంబరాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఇక్కడ బంగారమ్మ జాతరను తిరునాళ్ళుగా నిర్వహించటం ఆనవాయితి. జాతరకు ముళ్లపూడి వాసులే కాకుండా చుట్టుపక్కల ఉన్న నారాయణపురం నుంచి కూడా విశేషసంఖ్యలో భక్తులు హాజరౌతారు. కాలనీ వాసుల ఆహ్వానం మేరకుసామాజిక వేత్త,వ్యాపారవేత్త మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాదం నాయుడు హాజరయ్యారు. వారికి ఆలయం తరపున గ్రామస్తులు స్వాగతం పలికారు. భక్తులకు జగన్నాధం నాయుడు ప్రసాదాలను వితరణ చేసారు. ఈ కార్యక్రమాల్లో దర్మయ్యయాదవ్, రవి యాదవ్, పుల్లయ్యానాయుడు, రమణయ్యనాయుడు,రమేష్, జగ్గరాజుపల్లి రాజశేఖర్, గుణశేఖర్, జింగిలిపాళెం, చిర్రిరాజాయాదవ్, చిర్రికేశవులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఆటలపోటీలు : బహుమతులు అందించిన డిఈవో



శ్రీకాళహస్తి, జులై 31 ప్రభాతవార్త : ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలో తిరుపతి జిల్లాలోని 34 మండలాలకు చెందిన విద్యాంగులు పిల్లలకు స్పోర్ట్ అండ్ గేమ్స్ నిర్వహించారు. ఇందులో దివ్యాంగులకు వారి వయస్సును బట్టి పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎంఎల్‌ఏ తనయ బియ్యపుపవిత్రాడ్డి విచ్చేశారు. అనంతరం పోటీలు నిర్వహించి బహుమతులను అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఐఈఆర్‌టి కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, వివిధ మండలాల నుంచి వచ్చిన ఐఈఆర్టీలు ఐడిఎస్‌ఎస్ దివ్యాంగుల చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూములను పరిరక్షించండి

సత్యవేడు, జులై 31,ప్రభాతవార్త: మండలంలోని ఆంబాకం పంచాయితీ రెవిన్యూలో అన్యాక్రాతమైన ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ తహసిల్దార్ షేక్ జరీనాకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సోమవారం సత్యవేడు రెవిన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో గ్రామస్తులు తహసిల్దార్‌ను కలిసి భూఆక్రమణల సమస్యను వివరించారు. ఇక్కడ సర్వే నెంబర్లు 218,191, 192, 193, 194లో ప్రభుత్వ భూములను ఆక్రమణకు గురిచేస్తున్నట్లు వారు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తహసిల్దార్, ప్రభుత్వ భూములను పరిశీలించి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గ్రామస్తులు మణి, విజయ్, జనార్ధన్, నాగరాజులు పాల్గొన్నారు.

### కన్నులపండువగా ప్రదోష నందిసేవ

శ్రీకాళహస్తి, జులై 31 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అత్యంత వైభవంగా ప్రదోష నందిసేవను కన్నులపండువగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తిని వెండి నందివాహనంపై ఆశీనుల్ని చేసి ఆలయంలో ప్రదక్షిణ చేయించారు. స్వామివారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు.

### జంతుశాస్త్ర అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రధానం

శ్రీకాళహస్తి, జులై 31 ప్రభాతవార్త : శ్రీవిద్యాప్రకాశనంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న మూడే.తులసికి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఈమేరకు 'న్యూరో ప్రొటెక్టివ్ ఎఫెక్ట్ ఆఫ్ ఎంబిక ఆఫిసినలిస్ ఫ్రూట్స్ ఎక్స్‌ట్రా ఆన్ ఆల్‌జీమర్స్ డిజీజస్ ఇన్‌డ్యూస్‌డ్ రాట్ బ్రెయిన్ ఎ నావల్ అప్రోచ్ టు ఐడెంటిఫై ద యాంటి ఆల్‌జీమర్స్ కాంపౌండ్' అనే అంశంపై ఎస్వీయు జంతుశాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ కె.యల్లమ్మ పర్యవేక్షణలో పరిశోధన పత్రం సమర్పించినందుకు గాను ఆమెకు డాక్టరేట్‌ను ప్రధానం చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగరాజునాయుడు తెలిపారు. ఈసందర్భంగా ఆమెను ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

### సినిమా థియేటర్లలో అక్రమాలు అరికట్టండి

శ్రీకాళహస్తి,జులై 31 ప్రభాతవార్త : పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలోని సినిమా థియేటర్లలో చేసే అరికట్టాలని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ప్రతినిధులు సోమవారం మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సినిమా థియేటర్లలో పార్కింగ్ పేరుతో దోపిడీ మరో వైపు వాటర్‌బాటిళ్ళు, కూల్‌డ్రింక్స్ అధిక ధరలకు విక్రయిస్తూ ప్రేక్షకులను దోచుకుంటున్నారన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ థియేటర్లలో అక్రమాలను అరికడుతామన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల కమిషన్ ఏపి డిప్యూటీ ఛైర్మన్ కోటేశ్వరబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భరత్‌రెడ్డి, పిఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ అండ్ సేఫ్టీ పరిశీలకులు హరీష్‌రెడ్డి, రాష్ట్ర పరిశీలకులు బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శివయ్యసన్నిధిలో అఖిల దేవగాండ్ల కర్నాటక రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి కర్నాటక రాష్ట్రం అఖిల దేవగాండ్ల సంఘం ఉపాధ్యక్షులు యం.నారాయణశెట్టి విచ్చేశారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. పట్టణ అఖిల గాండ్ల తెలికుల సంఘంలోని సభ్యులు కులసంఘానికి కులస్తులకు చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం ఆయనకు శ్రీకాళహస్తి కోవాను ఇచ్చి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గిరిధర్, చెంచయ్య, నెమళ్ళూరు సుబ్రమణ్యం(బుజ్జి) వంకాయలసిద్దులయ్య, చంద్ర, మునిగోపాల్, సుబ్రమణ్యం, మణి తదితరులు పాల్గొన్నారు.

### హత్యాయత్నం కేసులో ముద్దాయి అరెస్టు



తిరుపతి క్రైం, జులై 31 ప్రభాతవార్త మున్సిపల్ ఆఫీస్ దగ్గర జులై 29న ఫుట్ పాత్ పై నిద్రిస్తున్న వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారైన ముద్దాయిని సోమవారం ముద్దాయిని పోలీసులు అరెస్టు చేసారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 29వ తేది రాత్రి కొత్త మున్సిపల్ ఆఫీస్ దగ్గర ఫుట్ పాత్‌పై నిద్రిస్తున్న రమేష్ అలియాస్ నరేష్ పై ముద్దాయి గొద్దు గణేష్ పెట్రోల్ పోసి నిప్పటించి పరారైయ్యాడు. కాలిన గాయాలతోరుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేసాడు. కేసును సవాలుగా స్వీకరించిన ముద్దాయిని తిరుపతి వెస్ట్ పోలీసులు అలిపిరి జూపార్క్ రోడ్డు నందు టాటా క్యాన్సర్ ఆసుపత్రి వద్ద ముద్దాయిని గుర్తించి అరెస్టు చేసారు. ముద్దాయి గణేష్ తిరుపతి నగరంలో తాపీ మేస్త్రి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ కేసు నందు ముద్దాయిని అరెస్టు చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విశేష కృషి చేసిన తిరుపతి వెస్ట్ సిఐ జయనాయక్, ఎస్ఐ ఓబయ్య, ఐడి పార్టీ సిబ్బంది వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులను జిల్లా ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి అభినందించి రివార్డులను ప్రకటించారు.

### టీడీపీతోనే భవిష్యత్‌కి గ్యారంటీ



వడమాలపేట, జులై 31 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో ప్రజల భవిష్యత్‌కు గ్యారంటీ లభిస్తుందని చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి యాళ్ళ లక్ష్మిప్రసన్న పేర్కొన్నారు. టీడీపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు సోమవారం గ్రామాల్లో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వడమాలపేట శ్రీకృష్ణుని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మమ్మకండ్రిగ గ్రామం ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి తెలుగు మహిళలు మేనిఫెస్టోలోని పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు భాస్కర్‌నాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి ధనంజయనాయుడు, జానా వెంకటయ్య, హేమావతి, నాగరత్న, రజని, గురు భూషణమ్మ, ధనలక్ష్మి, అమ్ములమ్మ, మురళీరెడ్డి, ధనంజయయాదవ్, రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

### గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న యువకులు అరెస్టు



తిరుచానూరు, జులై 31 ప్రభాతవార్త : తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి ఉదంతం కలకలం రేపింది. సోమవారం తిరుచానూరు సిఐ శివప్రసాద్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల మేరకు తిరుపతి రూరల్ మండలం ఎమ్మార్వో టీవీ సుబ్రమణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు డిఎస్పి టిడి యశ్వంత్ ఆదేశానుసారం జులై 30వ తేది మధ్యాహ్నం 3 గంటలకు నాయుడుపేట టూ పూతలపట్టు హైవే మధ్యలో గల తనపల్లి బస్ స్టాప్‌లో ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేశారు. తమిళనాడు చెందిన ముద్దాయిలలో ఏ1 దివిన్ సెల్వరాజ్, నమ్మకల్ జిల్లా, ఏ2 తనుష్ కృష్ణ కన్యాకుమారి జిల్లా, ఇద్దరిని అరెస్ట్ చేసి దాదాపుగా 10,000 వేల రూపాయిల విలువ గల 2 కేజీల 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాం డ్‌కు తరలించారు. ఈ కేసు చేదనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తిరుచానూరు సిఐ శివప్రసాద్ రెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది ముని, మనోహర్, ప్రసాద్‌ని జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి అభినందించి, రివార్డులను ప్రకటించారు.

### లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమం

తిరుపతి (విద్య), జులై 31 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయనం కేంద్రం రాస్ బాలాజీ బాలవికాస్ సంయుక్త ఆధ్వర్యంలో రేణిగుంట మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సోమవారం లింగ వివక్షత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్ బాలాజీ బాల వికాస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయచంద్ర నాయుడు మాట్లాడుతూ మహిళలు పిల్లలకు సంబంధించిన వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తుందని అందులో భాగంగా కృష్ణాపురంలో లింగ సమానత్వం అనే అంశం పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. లింగ అసమానత అనేది మన సమాజంలో, సంస్కృతి, సాంప్రదాయాలలో, మన ఆచార వ్యవహారాలలో ఎప్పటి నుంచో పాతుకుపోయిన దురాచారమన్నారు. మగ ఆడ బిడ్డల మధ్య వ్యత్యాసాలను చూడడం ఆహారం, ఆరోగ్యం, విద్య, ఉద్యోగం, వివాహం, రాజకీయ ప్రవేశం ఇలాంటి ఎన్నో దశలలో మగ బిడ్డకు ఇచ్చినంత ప్రాధాన్యత ఆడపిల్లకు ఇవ్వడం లేదని దీనివల్ల లింగ సమానత్వం సాధించలేమని అందుకు పిల్లల పెంపక విధానంలో తల్లిదండ్రుల్లో మార్పు రావాలి అప్పుడే లింగ సమానత్వం సాధించగలమని లింగ సమానత్వమే దేశ అభివృద్ధికి మూలం అని తెలియజేసారు. లింగ సమానత్వ ఆవశ్యకతకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు జీవిత కథలు ద్వారా మహిళలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో రాస్ బాలాజీ బాల వికాస్ సిబ్బంది బాలకృష్ణ, మోహన్ రెడ్డి, మహిళా అధ్యయన కేంద్రం రీసర్చ్ అసిస్టెంట్ డాక్టర్ ఎం. ఇంద్రాణి, ప్రీతి, మహిళలు పాల్గొన్నారు.

### వైద్యానికి ప్రతి నెల రూ.5వేలు



శ్రీకాళహస్తి,జులై 31 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లో నివాసముంటున్న రెహ్మాన్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా తెలుసుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట బాధితుని వైద్య ఖర్చులకు ప్రతి నెల రూ.5వేలు ఇస్తామని ప్రకటించారు. ఆమె మానవతా ధృక్పథానికి పలువురు అభినందించారు. రాజీవ్ నగర్‌లో నివాసుముంటున్న మైనారిటి మహిళ పర్వీన్ కుమారుడు రెహమాన్ బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆ విషయం తెలుసుకున్న వినూత పరామర్శించారు. ఆమెకు రెహమాన్ ఆరోగ్య పరిస్తితి వివరించారు. ప్రతి నెల వైద్యం కోసం చెన్నై వెళ్ళి వస్తున్నట్లు వివరించారు. వృత్తి రీత్యా బీడీలుచుడితేనే కుటుంబం గడుస్తున్నట్లు వివరించారు. దాంతో వినూత వైద్యానికి చెన్నైకు వెళ్ళి రావటానికి ప్రతి నెల రూ.5వేలు అందిస్తామని ఆమెకు భరోసా ఇచ్చారు. మొదటగా రూ.5వేలు అందించారు. ఆమెతో పాటు దండి రాఘవయ్య,తోట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### సైన్సుతోనే దేశాభివృద్ధి

శ్రీకాళహస్తి, జులై 31 ప్రభాతవార్త : ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తిరుపతి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ, రీజినల్ సైన్స్ సెంటర్ తిరుపతి మరియు రాయల్ సొసైటీ ఆఫ్ ఇంగ్లాండ్ వారు సంయుక్త ఆధ్వర్యంలో జరిగినటువంటి మొట్టమొదటి యూసఫ్ హమీద్ కెమిస్ట్రీ క్యాంపుకు ఊరందూరు ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు ఎంపికై శిక్షణ పొందారన్నారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి మాట్లాడుతూ తమపాఠశాల నుంచి విద్యార్ధినులు ఎంపికవడం అభినందనీయం అన్నారు. సైన్సుపై మక్కువ అందరు పెంచుకోవాలని శాస్త్రవేత్తలుగా రాణించి అనేక నూతన ఆవిష్కరణలును కనుగొని దేశాన్ని ప్రపంచంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్ళాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మురళీ, మల్లికార్జున, సుమతి, వరలక్ష్మి, రజియా, అనూష మరియు ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

### జగనన్న ఇళ్లు కావవి..పేదల పాలిట 'కన్నీళ్లు'..

**-జనసేన జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్..**



తిరుపతి ప్రెస్‌క్లబ్,జులై 31 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఆహా ఓహో అంటూ గొప్పలు చెప్పుకుంటూ కట్టిస్తున్న 'జగనన్న ఇళ్లు' ఇండ్లు కావని,అవి పేదల పాలిట 'కన్నీళ్లని జనసేన పిఏసి సభ్యుడు,ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన జగనన్న కాలనీల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత రెండు రోజులుగా జనసైనికులు జగనన్న కాలనీల వద్ద చేసిన నిరసన కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజల నుండి స్పందన రావడం శుభపరిణామమన్నారు. లక్షలాది ఇళ్లు నిర్మించామని గొప్పలు చెప్పుకునే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి..జనసేన చేసిన డిజిటల్ క్యాంపెయిన్ చూసైనా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని సూచించారు. ఓ మోస్తరు వర్షానికే జగనన్న కాలనీలు మొత్తం చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయని అన్నారు. పేదలకిచ్చే ఇంటి స్థలాల్లో కూడా వైసిపి నేతలు భారీ అవినీతికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. వీటిపై తమ జనసైనికులు క్షేత్రస్థాయిలో అక్కడికెళ్లి పరిశీలించిన పిదప అనేక వాస్తవాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలోని 66 మండలాల్లో జనసేన నాయకులు,జనసైనికులు డిజిటల్ క్యాంపె యిన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఆధారాలు లేకుండా జనసేన ఎప్పుడూ మాట్లాడదని, ఎల్లప్పుడూ ప్రజల సమస్యల పట్ల ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు. డిజిటల్ క్యాంపెయిన్ చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చిన జనసైనికులకు అభినందనలు తెలుపుతున్నాని డా॥హరిప్రసాద్ అన్నారు.

### మా అన్నయ్యను ఆశీర్వదించండి..!

**వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి**



రామచంద్రాపురం, జులై 31 ప్రభాతవార్త: చంద్రగిరి వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థిగా మా అన్నయ్య చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆశీర్వదించి 2024 సాధారణ ఎన్నికలలో గెలిపించాలని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కోరారు. సోమవారం దేసూరు కండ్రిగ, పారకాల్వ గ్రామాలలో గడప గడపకు హర్షిత్ రెడ్డి కార్య క్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తామ న్నారు. అనంతరం ప్రభు త్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను గడపగడపకు అందజేశారు. పారకాల్వలోని నవశక్తి పీఠాన్ని సందర్శించి గురుజీ ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏ.వి.బ్రహ్మా నందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, వైసిపి నాయకులు భానుయాదవ్, మహేంద్రరెడ్డి, రాజేష్, వెంకటేష్, భాస్కర్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

### ఐవోబీ మేనేజర్ సేవలు అభినందనీయం

రేణిగుంట, జులై 31 ప్రభాతవార్త: రేణిగుంట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సీనియర్‌మేనేజర్‌గా శ్రీనివాస్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు అన్నారు. బ్యాంకులో ఖాతాలో ఉన్న ఖాతాదారుడు మృతి చెందడంతో ఆయన భార్యకు పీఎంఎస్‌బీవై బీమా ద్వారా రెండు లక్షల రూపాయల బీమా నగదుకు సంబంధించిన చెక్కు అందజేసిన ఘనత మేనేజర్ శ్రీనివాస్‌కే దక్కుతుందని జూలియన్‌రాజు కితాభించారు. ఆయన చేస్తున్న సేవలకు అభినందన తెలుపుతూ మేనేజర్ 54వ పుట్టిన రోజు వేడుకలను బ్యాంకులో ఘనంగా నిర్వహించారు. ఆసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మేనేజర్ చేత కేక్ కట్ చేయించి అందరికి పంచారు.

### మహిళల పోరు యాత్రకు ఘన స్వాగతం

రేణిగుంట, జులై 31 ప్రభాతవార్త: భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యాన మహిళల పోరు యాత్రలో భాగంగా జరుగుతున్న రాష్ట్ర బస్సు యాత్రకు సోమవారం రేణిగుంటలో ఘన స్వాగతం లభించింది. రేణిగుంట బాలికల ఉన్నత ప్లస్‌టు పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో మహిళా నాయకులు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను తీవ్రంగా ఖండించారు. మత్తు పదార్థాలను నియంత్రించినప్పుడే మహిళలకు రక్షణ లభిస్తుందని తెలిపారు. యాత్ర జులై 28వ తేదీ నుంచి ప్రారంభమైందని ఆగస్టు 9వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి.మస్తాన్, నెల్లూరు జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, ఎస్ఎఫ్ఐ డబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, తిరుపతి జిల్లా అధ్యక్షురాలు జయంతి, కార్యదర్శి సాయి లక్ష్మి, రేణిగుంట మండల ఐద్వా నాయకులు లక్ష్మి, రాజేశ్వరి, సత్యశ్రీ, ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు అంబికా తదితరులు పాల్గొన్నారు.

### కరకంబాడిలో ఇంటింటికి మీ బొజ్జల

రేణిగుంట, జులై 31 ప్రభాతవార్త: ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితరెడ్డి టీడీపీ శ్రేణులతో కరకంబాడి పంచాయతీ కరకంబాడిల సోమవారం పర్యటించారు. తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యే, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటికి తిరిగిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, జిల్లా నాయకుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, కరకంబాడి టీడీపీ నేతలు నగరి మునయ్య, కె.వి.చలం, టీడీపీ సీనియర్ నేతలు మునస్వామినాయుడు, అడ్వకేట్ ఉదయభాస్కర్, సూరిబాబు, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## బిసిల ఆవేదనకు 'పెయిడ్' ముద్ర వేయడం దారుణం

**-తిరుపతి పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు రుద్రకోటి డిమాండ్**



తిరుపతి ప్రెస్‌క్లబ్,జులై 31 ప్రభాతవార్త: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న 'యువగళం' పాదయాత్రలో రాష్ట్రంలోని బిసి సామాజికవర్గం వారు ఈ వైసిపి పాలనలో పడుతున్న బాధలను లోకేష్‌కు చెప్పుకుంటే..వైసిపి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ వారికి 'పెయిడ్ ఆర్టిస్టు'లని ముద్ర వేయడం దారుణమని టిడిపి తిరుపతి పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం అన్నారు. మోపిదేవి వెంకటరమణ వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బిసి సంఘాల నాయకులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈనెల 27న ఒంగోలులో నిర్వహించిన 'జయహో బిసి' సభలో పలువురు బిసిలు తమ సమస్యలు లోకేష్‌కు చెప్పుకున్నారు .ఇందులో భాగంగా తన అక్కను వేధించిన వ్యక్తిని నిలదీసినందుకు 15 ఏళ్ల బాలుడిని వైసిపి గూండాలు అత్యంత పాశవికంగా నోటిలో గుడ్డలు కుక్కి పెట్రోల్ పోసి సజీవ దహనం చేశారని మృతుడి అక్క బాధపడుతూ తనకు న్యాయం చేయాలని లోకేష్‌కు కన్నీళ్లతో చెప్పుకుంది. దానిని కూడా పెయిడ్ ఆర్టిస్టులతో నాటకం ఆడుతున్నారని వైసిపి నేతలు అనడం వారి నీచ మనస్తత్వానికి నిదర్శనమన్నారు. అనంతరం దంపూరి భాస్కర్‌యాదవ్ మాట్లాడుతూ నాలుగేళ్ల వైసిపి పాలనలో 60 మంది బిసిలు హత్యగావింపబడ్డారని, అలాగే వేలాది మంది టిడిపి నాయకులపై అక్రమ కేసులు బనాయించడం, దాడులకు తెగబడటం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎన్నో అరాచకాలు,హత్యలు వైసిపికి చెందినవారు చేస్తున్నా,ఏనాడూ సిఎం జగన్ వాటిని ఖండించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అమర్‌నాథ్ కుటుంబానికి 10 లక్షల ఆర్థిక సాయం చేయడంతో పాటు,అతని అక్కకు చదువు పూర్తయ్యే వరకు మొత్తం బాధ్యత చంద్రబాబు తీసుకున్నారు. అయితే ఒక సిఎంగా ఉండీ జగన్ స్పందించకపోవడం అతని క్రూర మనస్తత్వానికి నిదర్శనమన్నారు. బిసిల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన మోపిదేవి తక్షణం క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నేతలు సిఎం జగన్ చిత్రపటాలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గురువారెడ్డి, దశరథాచారి, మునస్వామి, చినబాబు,పుష్పవతి యాదవ్,వశ్వనాథం,జగన్నాధం,మిన్నల రవి, రాజయ్య, కరాటే చంద్ర,గాండ్ల హరిబాబు, మధుసూధన్‌యాదవ్, శ్రీరాములు, పరంధామయ్య, జ్ఞానశేఖర్, తూకివాకం భాస్కర్ యాదవ్,శ్రీహరి యాదవ్,వేణు తదితరులు పాల్గొన్నారు.

### ప్రయాణీకుల అవసరాలను బట్టి బస్సులు నడపండి



శ్రీకాళహస్తి,జులై 31 ప్రభాతవార్త బి శ్రీకాళహస్తి నుంచి గ్రామీణ ప్రాంతాలకు, పట్టణాలకు ప్రయాణీకులకు అవసరమైన రీతిలో బస్సులు నడపాలని యేవనేస్తం బృందం డిపోమేనేజర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తికి నిత్యం చెన్నై నుంచి శ్రీకాళహస్తికి,శ్రీకాళహస్తి నుంచి చెన్నైకు ఉద్యోగ రీత్యా,వ్యాపారం నిమిత్తం సోమవారం వేకువ జామున భారీ ఎత్తున ప్రయాణాలు సాగిస్తుంటారు. కానీ ఇక్కడ నుంచి చెన్నైకు ఉదయం 5గంటలకు ముందు బస్సుల్లేదు. 5గంటల బస్సు కూడా 4.50గంటలకు బయలుదేరుతుందని ఆన్‌లైన్లో చూపుతారు. కానీ ఉదయం 5.15గంటలకుకాని బస్సు ప్రారంభం కాదు. ఇక తిరుపతి నుంచి ఆ సమయంలో 200 ఎసి బస్సు శ్రీకాళహస్తి మీదుగా సాగుతుంది. కానీ శ్రీకాళహస్తి నుంచి వెళ్ళె ప్రయాణీకులకు అవకాశం లేదు. తిరుపతి నుంచే ఫుల్‌గా వస్తారు. ఇక గతంలో శ్రీకాళహస్తి డిపో నుంచి తమిళనాడుకు చెందిన 114 బస్సులు నడిచేవి. అవి కూడా సక్రమంగా తిరగటం లేదు. దాంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో మునిశేఖర్‌తో పాటు మండల కోఆర్టినేటర్ నాగమణి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I.(OLD NAME) **CHOWDAVARAM UMA MAHESHWAR REDDY**S/O CHOWDAVARAM RAGHURAMIREDDY CHANGE MY NAME IS (NEW NAME) **CHOWDAVARAM UMA MAHESWAR REDDY** S/O CHOWDAVARAM RAGHURAMIREDDY RESIAT1/1745B MAIN ROAD CHITVEL,ANNAMAYA DT AP.WIFE PNO N9829601.

## ఆకట్టుకున్న స్వర్గారోహణపర్వం



తిరుపతి, జులై 31ప్రభాతవార్త: ఆధ్యాత్మిక పురాణ ప్రవచకుడు గరికపాటి రమేష్‌బాబు సోమవారం రాత్రి అన్నమాచార్యకళామందరింలో స్వర్గారోహణ పర్వం ప్రవచనం చేశారు. భారతంలోని చివరి అంకమైన మహాప్రస్థానం సమయంలో ధర్మరాజుతో పాటే ద్రౌపది, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుడు ఒక శునకం వారివెంట స్వర్గానికి పయనమవుతాయని,ధర్మాన్ని పద్ధతి కలిగిన ధర్మరాజు ఒక్కడే స్వర్గారో హణం చేస్తారని తెలిపారు. ప్రవచనకర్త గరికపాటి రమేష్ బాబును రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి కళాకారులు సన్మానించారు.

## కాణిపాకంకు పోటెత్తిన భక్తజనం

**-దర్శనానికి నాలుగు గంటల సమయం -కిక్కిరిసిన వాహన పార్కింగ్‌లు**



కాణిపాకం, జూలై 31 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయం సోమవారం భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. అయితే సోమవారం కూడా వివిధ ప్రాంతాల నుండి ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే పొరుగు రాష్ట్రం తమిళనాడులోని తిరువణ్ణామలైలో జరిగే పవిత్రమైన అధిక శ్రావణ పౌర్ణమి వేడుకల గిరి ప్రదక్షణకు వెళ్ళే భక్తులు బస్సుల్లో భారీగా తరలిరావడం, తిరుమల వెళ్ళే తీర్థజనం కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వైపు తిరువణ్ణామలై వెళ్ళే భక్తులు వచ్చిన బస్సులు భారీ వాహనాలతో వాహన పార్కింగ్‌లు కిటకిటలాడాయి.

## డిజిటల్ తరగతులతో అత్యున్నత విద్యాబోధన

**-జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ శేఖర్**



తొట్టంబేడు, జూలై 31 ప్రభాతవార్త : డిజిటల్ తరగతులతో విద్యార్థులకు న్యాతా ప్రమాణాలతో పాటు అత్యున్నత విద్యాబోధన ప్రమాణాలు కూడిన బోధన అందుబాటులో ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపునకు డిజిటల్ బోధన విధానాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చే విధంగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా పరిధిలో 1050 పాఠశాలల్లో డిజిటల్ బోధన పద్ధతిలో తరగతులు నిర్వహణకు అవసరమైన డిజిటల్ ఐఫాడ్లు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని 16 తరగతి గదులను డిజిటల్ బోధన విధానంను అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. డిజిటల్ తరగతులను గురించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన ఉంటుందన్నారు. పాఠశాలలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సహకారంతో ప్రొజెక్టర్ వీడియో పాఠ్యాంశాలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రానున్న రోజుల్లో డిజిటల్ బోధనతోనే విద్యార్థులు అత్యున్నత ప్రమాణాలను అందుకునే విధంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రెండో విడత నాడు నేడు పనులను ఆగస్టు చివరినాటికి పూర్తిచేయనున్నట్లు తెలిపారు. కాగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళల సమానత్వం కోసం ప్రతిఘటన తప్పదు

**-ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి**



తొట్టంబేడు, జూలై 31 ప్రభాతవార్త : మతతత్వ బిజెపి పాలనలో భరతమాత సమానులైన మహిళలను చెరబట్టేవారు శిక్షార్హులు కాదని, వారిని సంస్కారులుగా సత్కరించి ఇంటికి పంపుతున్నారని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఐద్వా సమావేశాన్ని నిర్వహించి సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలను వివరించారు. ఆస్తులు, సంపద, రాజకీయ లబ్దికోసం బిజెపి మతాలు, తెగల మధ్య అల్లర్లు సృష్టిస్తోందని దుయ్యబట్టారు. ఐద్వా చేపట్టిన హింసపై మహిళా పోరుయాత్ర శ్రీకాళహస్తి పట్టణానికి చేరుకుంది. ఈసందర్భంగా తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఐద్వా సమావేశాన్ని నిర్వహించి సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలను బాలికలకు సమగ్రంగా వివరించారు. స్త్రీ సమానత్వం రావాలన్నా, మహిళలపై హింస తగ్గాలన్నా మహిళలు ప్రతిఘటించక తప్పదని ఆమె వివరించారు. సంపద, ఆస్తులు, రాజకీయ లబ్దికోసమే మణిపూర్ అల్లర్లు చెలరేగాయ న్నారు. కుకి తెగకు చెందిన ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి, నగ్నంగా ఊరేగించి ఆపైన అత్యాచారం, హత్య చేస్తే డబుల్ ఇంజిన్ సర్కారైన బిజెపి ప్రభుత్వం మూడు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఎందుకు చర్యలుతీసుకోలేదని ప్రశ్నించారు. ఒలింపిక్‌లో పతకాలు సాధించి దేశ ప్రతిష్టను ప్రపంచమంతా చాటిన మహిళా రెజ్లర్లపై ఆ ఆకాడమీ ఛైర్మన్, బిజెపి ఎంపి అయిన బ్రిజ్‌భూషణ్ లైంగిక వేదింపులకు పాల్పడితే చర్యలుతీసుకోవాలని రెజ్లర్లతో పాటు దేశం మొత్తం డిమాండ్ చేస్తుంటే మూడేళ్ళు కావస్తున్నా మోడీ ప్రభుత్వం ఎందుకు చర్యలుతీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 8న విజయవాడలో జరిగే ఐద్వా బహిరంగసభకు మహిళలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు సావిత్రమ్మ, మస్తాన్‌బీ, శివకుమారి, సాయిలక్ష్మి, జయంతి, రాజేశ్వరి, కేశవమ్మ, పద్మావతి, సిఐటియు నాయకులు అంగేరిపుల్లయ్య, పెనగడం గురవయ్య, గంధంమణి, జనవిజ్ఞాన వేదిక నాయకులు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ విక్రయ దుఖానాలను ఆకస్మిక తనిఖీ చేసిన

**జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ అధికారి**



తిరుపతి క్రైం, జులై 31 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ డిజీ ఎ. రవి శంకర్ ఆదేశాలు ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్ విక్రయ దుఖానాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సోమవారం తిరుపతి జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి తిరుపతి, చిత్తూరు జిల్లాలలోని నాలుగు పెట్రోల్ విక్రయ దుఖానాలను భద్రతా ప్రమాణాలు, నాణ్యమైన, ఖచ్చితమైన తూకంతో పెట్రోల్, డీజిల్‌ను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు, విక్రయించారా లేదా అని తనిఖీలు నిర్వహించారు. అందులో నగరి, పచ్చికాపలం రెండు పెట్రోల్ విక్రయ దుకాణములలో తక్కువ కొలతలతో విక్రయిస్తునందున స్టాప్ సేల్ ఆర్డర్స్‌ను ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇక మీదట తరచుగా ఇటువంటి తనిఖీలు చేపట్టడం జరుగుతుందని, దానికి సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.

# గ్రానైట్ క్వారీ పేలుళ్లు ఆపండి మహాప్రభో!

**- ఇళ్ల గోడలు కదులుతున్నాయ్.. పొలాలు నాశనమవుతున్నాయ్ !**

**- తిమ్మాపురం వద్ద గ్రామస్తుల ఆందోళన**



క్వారీ ప్రాంతంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కుప్పంరూరల్, జూలై 31 ప్రభాతవార్త :మా ఊరి వద్ద క్వారీ వద్దని కలెక్టర్ సారుకు 2021లో ఫిర్యాదు చేశాము.. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సారు అధికారులను ఆదేశించారు.. అయితే మరలా తమ గ్రామం వద్ద క్వారీ పేలుళ్లు చేపడుతున్నారు.. మా ఇళ్ల బీటలు వాలుతున్నాయి.. క్వారీ పేలుళ్లు ఆపాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు క్వారీలో పనులు చేపడుతున్న వారితో చర్చించి తాత్కాలికంగా పనులు నిలిపేశారు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని మిట్టపల్లి పంచాయతీ ఆవులనత్తం సమీపం తిమ్మాపురం వద్ద కాళికాదేవి ఆలయంకు కొంత దూరంలో సర్వే నెం 20లో సుమారు 33 ఎకరాల ప్రభుత్వ గయాలు పొరంబోకు స్థల ం ఉంది. ఇక్కడ గ్రానైట్ సంపద ఏర్పడి ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ క్వారీ నిర్వహించేందుకు 2021సం॥లోనే గ్రానైట్ వ్యాపారులు సిద్ధమయ్యారు. అయితే గ్రానైట్ క్వారీ ధాటికి తమ పంటపొలాలు నాశనమవు తాయని పేర్కొంటూ క్వారీకి అనుమతి ఇవ్వరాదని అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంగా తగు విచారణ చేపట్టి నివేదిక అందించాలని అప్పట్లో జిల్లా కలెక్టర్ హరినారాయణన్ మైనింగ్ ఎడి, కుప్పం తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతల అండదం డలతో ఆ క్వారీని దక్కించుకునేందుకు గ్రానైట్ వ్యాపారులు కీలక ంగా వ్యవహరించారని సమా చారం. 33 ఎకరాల స్థలంలో సుమారు 7.5 ఎకరాల మేర గుట్ట భూములను ఓ గ్రానైట్ సంస్థకు మైనింగ్ అధికారులు లెస్సీ పేరిట2022లో మైనింగ్ లీజును 2032వరకు పదేళ్ల పాటు లీజుకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. ఈ లీజు పొందిన గ్రానైట్ వ్యాపారి తమిళనాడు రాష్ట్రం హోసూరుకు చెందిన మరో గ్రానైట్ సంస్థకు క్వారీని లీజుకు వేశారని తెలిసింది. తమిళనాడుకు చెందిన మరో గ్రానైట్ సంస్థ ఇక్కడ గ్రానైట్ మైనింగ్ కోసం పేలుడు పదార్థాలు వాడుతున్న నేపథ్యంలో సోమవారం పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆందోళనకు దిగారు. తమ గ్రామం వద్ద క్వారీ వద్దని ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేసినా మరలా ప్రస్తుతం గ్రానైట్ తవ్వకాల కోసం పేలుళ్లు జరపడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన కొంతమంది అధికారులు కాసులకు కక్కుర్తి పడి తమకు అన్యాయం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు తగు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఆవులనత్తం, తిమ్మాపురం గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. మరి జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## సీఎం జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, జులై 31, ప్రభాతవార్త: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిం చినందుకు, ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణానికి రూ.553 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సోమవారం తాడేపల్లి సీఎం కార్యాలయంలో రామ్‌కుమార్‌రెడ్డి సీఎంను కలిసి పుష్పగుచ్చం అందజేశారు. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం నిధులు విడుదల చేయడానికి పిలిచిన వెంటనే వచ్చినందుకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.33 కోట్లు ఆదాయం



కాణిపాకం, జూలై 31 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.33 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. సోమవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. 16 రోజులకు గాను హుండీల ద్వారా 1,33,40,762 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 152 గ్రాముల బంగారు, 3 కిలోల 500 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 7,556 రూపాయలు ఆదాయంగా వచ్చింది. దీనితో పాటు 1,077 అమెరికా డాలర్లు, 2040 ఇంగ్లాండ్ ఫౌండ్స్, 23 మలేసియా రింగిట్స్,2 సింగపూర్ డాలర్లు, 25 యూఏఈ దినార్స్, 100 యూరో కరెన్సీ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి,రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, మేహామాలిని, సూపరెండెంట్‌లు రవి, రంగస్వామి, యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వరసిద్దుని సేవలో సినీ నటుడు తనికెళ్ళ



కాణిపాకం, జూలై 31 ప్రభాతవార్త: ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ళ భరణి సోమవారం రాత్రి కుటుంబ సమేతంగా సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం వారికి వేదమండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అలాగే వారు శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## సప్తగిరి నగర్‌లో చెవిరెడ్డి లక్ష్మికి ఘన స్వాగతం



తిరుపతిరూరల్, జూలై31 ప్రభాతవార్త: జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ అన్నారు. గడప గడపకు ఆత్మీయ పలకరింపులో భాగంగా సప్తగిరి నగర్‌లో పర్యటించిన ఉప సర్పంచ్ వసంత అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చెవిరెడ్డి లక్ష్మికి స్థానిక మహిళలు ఘన స్వాగతం పలికారు. కరోనా విపత్కర పరిస్థితులలో నియోజకవర్గ ప్రజల ప్రాణాలను కాపాడెందు తన ప్రాణాన్ని కూడా లెక్కచేయకుండా నిరంతరం ప్రజా సంరక్షణ కోసం ఎమ్మెల్యే చెవిరెడ్డి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేసారు. సప్తగిరి నగర్ ప్రజలు, ముఖ్యంగా మహిళలు చూపుతున్న ఆదరణ, ఆప్యాతయ మరవలేనిదని, ఎల్లవేళ్లల అండగా ఉంటామని తెలిపారు. ఉరవ కాల్వ పనులు జోరుగా సాగుతున్నందున స్థానికులు ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

## అగ్ని హోత్రిగా ద్రౌపదీ



నగరి, జూలై 31 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి చింతలపట్టెడలో ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే ద్రౌపదీ తిరుణాళ్ళలో భాగంగాసోమవారం ద్రౌపదీదేవికి అగ్నిహోత్రి అంకారం చేశారు. అఖిలోభుడనే రాక్షసుని సంహరించడానికి ద్రౌపదీదేవి అగ్రినుంచి అవతరించిందని ప్రతీతి. అగ్ని నుంచి ఉద్భవించి నందుకు ప్రతీకగా ఆమెకు అగ్నిహోత్రి అలంకారం చేశారు. అమ్మవారి విగ్రహం చుట్టూ పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఆలయం వద్ద నిర్వహించిన మహాభారత పారాయణంలోను భాగవతారిని అగ్గి కుండలను పట్టుకుని పారాయణం చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ వేడుకలను చూడడానికి భక్తులు ఆలయం వద్ద అధిక సంఖ్యలో బారులు తీరారు. ఏర్పాట్లను ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ పర్యవేక్షించారు.

## ప్రజల సమస్యలకు, ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత

**త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు**

తిరుపతి క్రైం, జులై 31 ప్రభాతవార్త : స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజల సమస్యలకు, ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డిపేర్కొన్నారు. సోమవారం ఎస్పి కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 87 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను కుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులందరితో ఎస్పి మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబం కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు చేశారు. స్పందన ఫిర్యాదులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, ఫిర్యాదులను చట్టప్రకారం విచారణ జరిపించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.

## చంద్రబాబు పర్యటనకు రూట్ మ్యాప్ పరిశీలన

రేణిగుంట, జూలై 31 ప్రభాతవార్త: ప్రతిపక్ష నేత టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆగస్టు నెలలో పర్యటన నిమిత్తం టీడీపీ అగ్రశ్రేణి నాయకులు సోమవారం రేణిగుంట మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కరకంబాడి పంచాయతీ మల్లెమడుగు, చైతన్యపురం వద్ద ఉన్న బాలాజీ రిజర్వాయర్ ప్రాంతాలను పరిశీలించారు. పరిశీలించిన వారిలో శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఎన్‌సీవీ నాయుడు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, జిల్లా టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నేతలు మునస్వామినాయుడు, నగరి మునయ్య, కె.వి.చలం, అడ్వకేట్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

## ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యత లోపం...గ్రామస్తులు నిరసన



చిల్లకూరు, జులై 31 ప్రభాతవార్త : మండలంలోని చింతవరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం కోటి 50 లక్షలతో నిర్మించడం జరుగుతుంది. అయితే నిర్మాణానికి నాణ్యమైన నది ఇసుకతో కట్టడాలు చేయాల్సి వుండగా సిలికా ఇసుకతోనే భవన నిర్మాణం పూర్తి చేసారని, తక్కువ సిమెంట్, నాణ్యతలేని ఇసుము ఉపయోగించడం జరిగిందన్నారు. కనీసం భవన నిర్మాణానికి నీటి బోరును ఏర్పాటు చేయకుండా ఇప్పటి వరకు ట్యాంకర్ల ద్వారానే నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ప్రారంభానికి నెల ముందుగానే గోడలకు పగుళ్ళు రావడం జరిగిందన్నారు. అదేమని గ్రామస్థులు వెళ్ళి అడగగా రకరకాల రంగులతో పగుళ్ళు కప్పిపుచ్చడం చేసారన్నారు. ఇప్పటికి కూడా త్రాగు నీరు ఏర్పాటు చేయలేదని, కొంత మేర సిసి రోడ్డు ఏర్పాటు చేయాల్సి వుందన్నారు. భవనం నిర్మాణం విషయంలో అన్ని రకాలుగా నాణ్యత లోపం ఉందంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట గ్రామస్తులు నిరసన తెలిపారు. భవన నిర్మాణం చేపట్టినన్ని రోజులు అధికారులు ఎవ్వరూ పెద్దగా వచ్చి తనిఖీ చేసినటువంటి దాఖలాలు లేవన్నారు. ఇకనైనా పై స్థాయి అధికారులు చర్యలు తీసుకుని విజిలెన్స్ తనిఖీ వేయాలని వారు కోరారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బి అధికారులను వివరణ కోరగా భవన నిర్మాణ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి. గోపాల్, కుమార సాయి గౌడా, పి. రాధాకృష్ణ, వై. రవేంద్ర గౌడా, జరుగుమల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో సినీ గాయకులు



శ్రీకాళహస్తి,జూలై 31 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ప్రముఖ సినీ గాయకులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పాడుతా తియ్యగాలో ప్రఖ్యాతి చెందిన గోపికా పూర్ణిమ, మల్లికార్జున్‌లు స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు.వారికి ఆలయ పిఆర్‌ఓ వెంకటస్వామి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు దర్శన ఏర్పాట్లు చేసారు.దర్శనానంతరం వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు. తమకు శివయ్య అనుమతిస్తే వచ్చే శివరాత్రికి తాము భక్తి రంజనిలో పాల్గొంటామని వివరించారు. స్వామి అమ్మవార్ల దర్శనం తమకు ఎ ంతో ప్రశాంతత కల్పించిందన్నారు.

## కళ్ళు తెరచిన శివయ్య..భక్తులతో కళకళ



శ్రీకాళహస్తి, జూలై 31 ప్రభాతవార్త : పట్టణంలోని కాసాగార్డెన్ విస్తరణ శిక్షణ కేంద్రంలో ఉన్న శివాలయంలో వెలసిన శివలింగం కళ్ళు తెరచినట్లు పట్టణంలో దావానంలా వ్యాపించడంతో పలువురు భక్తులు అక్కడకు చేరుకున్నారు. ఇటీవలే శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంప్రోక్షణ చేశారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి భక్తులు తరలిరావడంతో పోలీసులు అక్కడకి చేరుకుని భక్తులను నియంత్రించారు. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తీశ్వరాలయ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. పరమేశ్వరుడు కళ్ళు తెరచిన విధంగా ఉండడంతో భక్తులు పూజలు జరుపుతున్నారన్నారు. దీంతో ఈప్రాంత అంతా సస్యశ్యామలంగా ఉంటుందని భావిస్తున్నారు.

## 3న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని కుప్పం పర్యటన



కుప్పం, జూలై 31 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆగస్టు 3వతేది కుప్పంలో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ప్రకటనలో తెలిపారు. 3వతేది ఉదయం 10.30గంటలకు మదనపల్లి నుంచి కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహం చేరుకుంటారన్నారు. అక్కడే మీడియాతో సమావేశమై స్థానికంగా పర్యటిస్తారన్నారు. రాత్రి ఆర్‌అండ్‌బి అతిథిగృహంలోనే బస చేసి 4వతేది ఉదయం పుట్టపర్తికి బయలు దేరుతారని పేర్కొన్నారు.

## బాలాజీరిజర్వాయర్‌ను సందర్శించిన : టిడిపి నేతలు



తిరుపతి,జులై 31ప్రభాతవార్త : ఆధ్యాత్మిక నగరం తిరుపతికి, పుణ్యక్షేత్రం తిరుమల దాహార్తిని తీర్చేందుకు ప్రతిపాదించి పనులు మొదలై ప్రస్తుతం ఆగిన బాలాజీ రిజర్వాయర్‌ను టిడిపి నేతల బృందం పరిశీలించింది. సోమవారం ఉదయం కరకంబాడి అటవీప్రాంతం సమీపంలో నిర్మాణపనులు ఆగిన ఈ రిజర్వాయర్‌ను టిడిపి బృందం తిరుపతి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ, పార్లమెంట్ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, శ్రీకాళహస్తి నేతలు ఎస్‌సివి నాయుడు, బొజ్జల సుధీర్, మునిరామయ్య తదితర నాయకులతో కలసి ప్రాజెక్టుల పరిస్థితిని పరిశీలించారు.

## ఎస్పీడీసీఎల్ సిజిఎం రషీద్ సేవలు అభినందనీయం

తిరుపతి కలెక్టరేట్, జులై 31 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ చీఫ్ జనరల్ మేనేజరుగా పదవీ విరమణ చేసిన ఎస్.హెచ్ రషీద్ సేవలు అభినందనీయమని ఆ సంస్థ డైరెక్టర్లు ఎన్‌విఎస్ సుబ్బరాజు, కె. శివప్రసాద్ రెడ్డిలు పేర్కొన్నారు. ఏపీఎస్పీడీసిఎల్ కార్పొరేట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ సమావేశ మందిరంలో సోమవారం పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఏపీఎస్పీడిసిఎల్‌లో వివిధ హోదాల్లో వినియోగదారులకు రషిద్ అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. సంస్థలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగపు జనరల్ మేనేజరుగా కొనసాగుతున్న సందర్భంలో ఆయన తన బృందంతో కలిసి ఆన్‌లైన్ హెచ్‌టి బిల్డింగ్, ఎస్‌ఏపి, ఈఆఫీస్‌ను విజయవాడ, గుంటూరులో స్కాడా సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చేసిన కృషి అభినందనీయమన్నారు. పదవీ విరమణ పొందిన ఆయన కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం పదవి విరమణ పొందిన ఎస్‌హెచ్ రషీద్ మాట్లాడుతూ ఏపిఎస్పీడీసీఎల్‌లో వివిధ హోదాల్లో విధుల నిర్వహణలో తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయనను సంస్థ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఛీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్ వరకుమార్, వి. సురేష్ కుమార్, పి. అయూబ్ ఖాన్, డివి చలపతి, కెఆర్‌ఎస్ ధర్మజ్ఞాని, ఓఎస్డీ ఎన్. శ్రీనివాసులు, జనరల్ మేనేజర్లు గోపాలకృష్ణ, పద్మ, శోభా వాలెంటీనా, రమణదేవి, శారద, జానకీ రామ్, మురళి, సురేంద్ర రావు, నాగరాజు, తిరుపతి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు ఎన్. నరేంద్ర నాథ్, ఎస్‌జె రామ్ మోహన్, వాసురెడ్డి, వాసుదేవ రెడ్డి, అనంత ప్రసాద్, మహేశ్వర్ రెడ్డి, దామోదరం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.